క్లుప్తంగా...

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ భగవత్‌గూడలో భవాని శివసాయి ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు దేవాలయ వ్యవస్థాపకులు దేవిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బుద్వేల్ భగవత్‌గుడాలో శివ, భవాని, గణపతి, సుబ్రహ్మణ్య, నాగదేవత, నంది, ఆంజనేయ, ధ్వజస్తంభ, సాయిబాబా, నవగ్రహ, బలిపీఠ, శిఖర దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. రేపటి నుంచి 7వ తేదీ వరకు ఈ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ముఖ్య అతిథిగా విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్, తోకల శ్రీనివాస్‌రెడ్డిలు హాజరవుతారని సమాచారం. వేదపండితులు బ్రహ్మశ్రీ రేవలిల రాజు శర్మ ఆధ్వర్యంలో ఈ మహోత్సవ పూజలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆశీర్వాదం



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం

రాజేంద్రనగర్: బుద్వేల్ బన్సీలాల్‌నగర్‌కు చెందిన శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్యాల సాయిమాలిక్ వివాహం బుధవారం ఘనంగా జరిగింది. నూతన దంపతులను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నంతో పాటు నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కలెక్టర్ ఆదేశాలతో కూల్చివేతలు



ఖానాపూర్‌లో కూల్చివేసిన ప్రహరీ

మణికొండ: గండిపేట మండల పరిధిలోని బుల్కాపూర్ నాలాను ఆక్రమించి నిర్మించిన ప్రహరీలను బుధవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఖానాపూర్‌లో ఆరు ప్రహరీగోడలు, మణికొండ, పుప్పాలగూడలో రేకుల షీట్‌లు, నిర్మాణాలను తొలగించారు. జిల్లా కలెక్టర్ హరీష్ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టామని మరిన్నింటిని తొలగించాల్సి ఉందని ఇరిగేషన్ ఏఈ నిఖేష్ తెలిపారు. మణికొండ, పుప్పాల్‌గూడలో నాలా వెంట ఉన్న ఆక్రమణలన్నింటినీ తొలగించకుండా కొన్నింటినే తొలగించారని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు మహిపాల్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌లతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

7న పాలపిట్ట సైక్లింగ్ రైడ్-2023

గచ్చిబౌలి: హైదరాబాద్ నగరంలో మొదటి ఫారెస్ట్ ట్రయల్ సైకిల్ రైడ్‌ను కొండాపూర్‌లోని పాలపిట్ట సైక్లింగ్ పార్కులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 7వ తేదీ ఉదయం 6 గంటలకు ఈ సైకిల్ రైడ్ ప్రారంభమవుతుంది. హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్, టీఎస్ఎఫ్‌డీసీ, డబ్ల్యూసీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రైడ్‌ను నిర్వహిస్తారు. పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు. 6వ తేదీ వరకు ఔత్సాహికులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

లింగంపల్లిలో మరో బ్రిడ్జి నిర్మించాలి



గచ్చిబౌలి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్ఓబీ) సమస్యాత్మకంగా మారిందని, మోడ్రన్ టెక్నాలజీతో మరో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌కు విన్నవించారు. సికింద్రాబాద్‌లో రైల్వే జీఎంను కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రైల్వే సమస్యలపై వారు విన్నవించారు. ఆదిత్యనగర్ వద్ద రైల్వే ట్రాక్‌కు సమాంతరంగా బాక్స్‌డ్రెయిన్ నిర్మాణం కోసం నాలా విస్తరణకు అనుమతి ఇవ్వాలన్నారు. మాదాపూర్-హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ చుట్టుపక్కల డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. శిల్పాగార్డెన్ వద్ద అండర్ పాస్ నుంచి మంజీరా పైపులైన్ రోడ్డులోని వైశాలినగర్ వరకు వరద నీటి కాలువ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. లింగంపల్లి- చందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న ఆర్‌యూబీ వద్ద నాలా విస్తరణ, సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు.

అలుగులో ఆక్రమణలు !

- తొండుపల్లి చెరువు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- నిర్మాణాలను నిలిపివేయాలని కౌన్సిలర్ల ఫిర్యాదు
- పట్టించుకోని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు



తొండుపల్లి చెరువు అలుగు వద్ద బఫర్‌జోన్‌లో భారీ అక్రమ నిర్మాణం

శంషాబాద్: పట్టణంలోని తొండుపల్లి చెరువుకు అత్యంత సమీపంలోనే బఫర్ జోన్‌లో జీవో 111 నిబంధనలకు రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు భారీ భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే అలుగు పరిధిలో భారీ ఎత్తున మట్టితో ఎత్తును పెంచేయడంతో పాటు నిర్మాణాలను కూడా శరవేగంగా చేపడుతున్నారు.

- ఎఫ్‌టీఎల్ పరిధిలోనే జరుగుతున్న ఈ నిర్మాణాలపై పట్టణ వాసులతో పాటు రెండు నెలల క్రితం మున్సిపాలిటీలో కొందరు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేసినట్టు సమాచారం.



అలుగు ప్రాంతంలో నిర్మాణదారులు వేసిన పైప్‌లైన్‌లు

చర్యలు శూన్యం..

- మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ నిర్మాణాలను నిలిపేయడంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.
- అలుగు పారే ప్రాంతంలో నీటిని మళ్లించేలా ప్రైవేటు వ్యక్తులు పైప్‌లైన్‌లు వేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల వైఖరితో ప్రస్తుతం తాగునీటితో ఉన్న తొండుపల్లి చెరువు సైతం భవిష్యత్తులో మురుగునీటితో నిండిపోయే ప్రమాదముందంటున్నారు.
- చెరువుల పరిరక్షణకు చర్యలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> అలుగు పారే చోట భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా.. అధికారులకు పట్టడం లేదు. చెరువు చెంతనే నిబంధనలు పాతరేస్తున్నా.. కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

చెరువులను పరిరక్షించాలంటూ.. ప్రభుత్వం చెబుతున్నా ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల వైఖరితో చెరువులు ఆగమావుతున్నాయి. తొండుపల్లి చెరువు బఫర్‌జోన్‌లో భారీ అక్రమ నిర్మాణంపై గత మున్సిపల్ కమిషనర్‌తో పాటు ప్రస్తుత కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీనిపై జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– వై. కుమార్, 6వ వార్డు కౌన్సిలర్

చర్యలు తీసుకుంటాం..

బఫర్‌జోన్‌లో నిర్మాణాలు జరుగుతున్నట్లు కౌన్సిలర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ అధికారులకు ఎఫ్‌టీఎల్‌ను సూచించాల్సిందిగా లేఖలు రాశాం. వారి నుంచి ఇంకా నివేదిక రాలేదు. అక్కడ జరిగే నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదు. అక్రమంగా ఉన్న వాటిపై చర్యలు తీసుకుంటాం.

– భోగీశ్వర్లు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

రూ.99 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ తదితరులు

రాజేంద్రనగర్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లిలో రూ.99 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు.

- ఉప్పర్‌పల్లి ప్రధాన రోడ్డు డ్రైనేజీ మురుగు పొంగిపోర్లుతూ.. కోర్టుకు వచ్చే వారికి స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్‌లు ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆయన నిధులను మంజూరు చేయించారు.
- బుధవారం డివిజన్ కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్‌తో కలిసి డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు.
- తాత్కాలిక మరమ్మతులు చేసిన ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు.
- ప్రతి వారం రోజులకు ఓసారి డ్రైనేజీ లీకేజీలు ఏర్పడుతున్నాయని డ్రైనేజీ నీరంగా రోడ్లపై పొంగిపోర్లుతుందన్నారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.
- ఈ సమస్యపై దృష్టి సారించి అధికారులతో వెంటనే చర్చించి శాశ్వత పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు.
- రూ.99 లక్షలతో ఉప్పర్‌పల్లిలో డ్రైనేజీ పైపులైన్ పనులను చేపడుతున్నామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నామన్నారు.
- ప్రజా సమస్యలను తెలుసుకుంటూ.. వాటి ప్రాధాన్యతకనుగుణంగా నిధులను మంజూరు చేయిస్తున్నామన్నారు. కోట్లాధిది రూపాయలతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు.
- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ భరోసా ఇచ్చారు. పసుపుల రమేష్‌రాంబాబు, సీ.హెచ్.శ్రీవర్ధన్‌రెడ్డి, సామ ప్రతాప్‌రెడ్డి, ముత్యంరెడ్డి, బడంగ్‌పేట్ రాంరెడ్డి, తుంగ ఇంద్రారెడ్డి, బొక్క లింగంరెడ్డి, నాయకులు పడమటి శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనుముల జాన్‌పాల్, సయ్యద్ ముజామ్మిల్ అహ్మద్, సలీమ్‌భాయ్, నర్సింగ్‌రావు, సన్న జగన్, మహేందర్, విశాల్, దేవరాజు, ప్రశాంత్, మహేష్, రాజ్‌కుమార్, కిషోర్, మధు, జలమండలి డివిజన్ జీఎం చంద్రశేఖర్, ఏజీఎం జమీల్ అల్తాఫ్ హుస్సేన్, మేనేజర్ శ్రావ్యరెడ్డి, మహ్మద్ జావేద్, కాంట్రాక్టర్ ఉపేందర్ శాంతికుమార్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లు

మణికొండ: గండిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం గణపతి పూజతో యాగశాల ప్రవేశం, మంటప పూజలు, వాస్తు పూజలు, రత్నన్యాసం, బీజన్యాసం, ధాతున్యాసం పూజలను నిర్వహించారు. అనంతరం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ, నాభిశిల ప్రాణప్రతిష్ఠ కళాన్యాసం, పూర్ణహుతి, మహాదాశిర్వచనము పూజలతో పూర్తి చేశారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్‌లు గోపాల సునీత గణేష్, విజిత ప్రశాంత్‌యాదవ్, నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కౌన్సిలర్ అరుణజ్యోతిలతో పాటు వేద పండితులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మేడే వారోత్సవాల్లో కబడ్డీ పోటీలు



పోటీల్లో పాల్గొన్న కార్మికులు, నాయకులు

రాజేంద్రనగర్: మేడే వారోత్సవాల సందర్భంగా కాటేదాన్ క్లస్టర్ ఇండస్ట్రీయల్ ఏరియాలో సీఐటీయూ అమరవీరుల శిబిరం వద్ద కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను బుధవారం రాజేంద్రనగర్ మండల సీఐటీయూ కమిటీ సభ్యులు వెంకటయ్య, టి.వెంకటేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కాటేదాన్ ఇండస్ట్రీ ఏరియాలో అనేక పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కార్మిక చట్టాలను అమలు చేయాలని కార్మికులందరికీ 8 గంటల పనిదినాలు, గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత, వసతి కల్పించాలన్నారు. 'కార్మికులు నిరంతరం దేశంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ.. రాజ్యాంగాన్ని కాపాడుదాం దేశాన్ని రక్షించుకుందాం' అన్నారు. 'కార్మిక చట్టాలను పెరిగిన ధరలకు అనుగుణంగా మార్చే విధంగా పోరాడుదాం' అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి

మణికొండ: వర్షాలు కురిసే సమయంలో ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండి వారి ఇబ్బందులను తీర్చాల్సిన బాధ్యత మనదేనని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సత్యబాబుతో కలిసి శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఎలక్ట్రిషన్‌లు, వాటర్‌మెన్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాలతో అనేక వీధులు, ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అలాంటి వారికి సకాలంలో అందుబాటులో ఉండి వారి సమస్య తీరేలా కృషి చేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో 24 గంటలు అందు బాటులో ఉండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా పనిచేయాలన్నారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఎఫ్ఐఆర్‌ను చూపెడుతున్న మైలారం సులోచన

శంషాబాద్: తాను కొనుగోలు చేసిన భూమిని రియల్టర్ కబ్జా చేయడంలో పాత్ర పోషించిన సర్పంచ్‌తో పాటు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ దళిత సీనియర్ నాయకురాలు మైలారం సులోచన డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని మదన్‌పల్లి కొత్త తండాలోని సర్వే నంబరు 50/69, 50/85లో అమూల్య అనే పట్టాదారు నుంచి నాలుగెకరాల పొలాన్ని కొనుగోలు చేశామన్నారు. సంబంధిత యజమానులు పాస్‌పుస్తకాలు లేకపోవడంతో మిగతా ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. ఇదే సమయంలో ఓ రియల్టర్‌తో పాటు కొందరు అధికారులు, స్థానిక సర్పంచ్ అండదండలతో ఇల్లు లేకున్నా ఇంటి నంబరు ఉన్నట్లు చేసి జీపీఏ చేసుకున్నారన్నారు. ఈ విషయమై శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు కూడా నమోదైందన్నారు. ఇల్లు లేకున్నా అక్రమంగా ఇంటినంబరు ఇవ్వడంతో పాటు ఎలాంటి పరిశీలన లేకుండా రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసిన దానిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి కేసులు నమోదు చేయాలన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. అధికారులపై సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు.

భార్యను వేధించిన భర్తకు 14 నెలల జైలు

శంషాబాద్ రూరల్: భార్యను మానసికంగా శారీరకంగా హింసించిన భర్తకు 14 నెలల జైలు శిక్ష పడింది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామంజాపూర్‌కు చెందిన నాగారం శ్రీనివాస్‌గౌడ్, మంజుల దంపతులకు ముగ్గురు సంతానం. కాగా గత కొన్నేళ్ల నుంచి భార్యను వేధించడం మొదలు పెట్టడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో గతంలోనే ఈ కేసు విషయంలో ఇద్దరి మధ్య రాజీ కుదిరింది. తర్వాత మళ్లీ వేదిస్తుండటంతో పాటు పొలం వద్ద గడ్డి కుప్పలను తగలబెట్టి భార్యను బయభ్రాంతులకు గురి చేశాడని భార్య 2013లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ వేశారు. ఈ కేసులో రాజేంద్రనగర్ మెట్రో పాలిటన్ 12వ అడిషనల్ న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించారు. నిందితుడికి 14 నెలల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

గచ్చిబౌలి: సైబర్ నేరాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని పోలీసులు సూచించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డిలోని మనీష్‌రెడ్డి పీజీలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహనా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగాయని, వీటిని అరికట్టడానికి అందరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా నెట్‌వర్క్‌ల పట్ల, వాట్సప్, ఫేస్‌బుక్‌లలో అన్నింటిని చూడాలనే ఆసక్తి, తెలియని వారితో పరిచయం పెంచుకోవడం వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. తమకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఇతరులకు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, 40మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: ప్రజలు కంటి సమస్యలను నివారించుకునేందుకు వార్డుల వారీగా ఏర్పాటు చేస్తున్న 'కంటి వెలుగు' శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన 7వ వార్డు నెక్నాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ బి. పద్మారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి పరీక్షలను నిర్వహించటంతో పాటు మందులు, అద్దాలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు జయరాజ్, ధన్‌రాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీ ఛానెల్‌తో రైతులకు మేలు



నూతన అవిష్కరణలను విడుదల చేస్తున్న అధికారులు



సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన యూట్యూబ్ ఛానెల్ ద్వారా 80 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందని వర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి అన్నారు. విశ్వవిద్యాలయ విస్తరణ విభాగం రాష్ట్రస్థాయి సదస్సు బుధవారం వర్సిటీ ఆడిటోరియంలో ప్రారంభమైంది. ఈ సదస్సులో విశ్వవిద్యాలయం పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏరువాక కేంద్రాలు, విస్తరణ విద్యాసంస్థ వ్యవసాయ సమాచార కేంద్రం, ఎలక్ట్రానిక్ విభాగంలో పనిచేసే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. రైతులకు అవసరమయ్యే సలహాలు, సూచనలు అందిస్తామని ఇప్పటి వరకు 389 వీడియోలు అప్లోడ్ చేశామన్నారు. రోజూ రైతులకు అవసరమైన సేవలను అందిస్తున్నామన్నారు.

- గతేడాది పనితీరును సమీక్షించి 2023-24 సంవత్సరంలో అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు.
- వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రారంభమైనప్పటి నుంచి 15పంటల్లో 61 రకాల్ని, 117 వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన విధానాల్ని రూపొందించామని పరిశోధన సంచాలకులు డాక్టర్ వెంకటరమణ వివరించారు. త్వరలోనే డ్రోన్ అకాడమీని ప్రారంభిస్తామని ప్రకటించారు.
- గత వారం రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు కొత్త సవాళ్లను తీసుకొచ్చాయని పంటల సీజన్‌లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని వర్సిటీ రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ అన్నారు.
- రాష్ట్రంలో కందులు, పత్తి పంటల విస్తీర్ణం మరింతగా పెరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.
- వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ తదితర నూతన టెక్నాలజీ అమలును విస్తృతం చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ సదస్సు మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

పీరం చెరువు కలుషితం కాకుండా చర్యలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి




పీరంచెరువు (ఫైల్)

- 'బర్డ్స్ ఆఫ్ పీరంచెరువు' పుస్తకావిష్కరణ
- రాష్ట్రంలో టాప్ 10 బర్డ్ హాట్ స్పాట్‌లలో ఒకటి



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు కలుషితం కాకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పీరంచెరువు ప్రాంతానికి చెందిన ధీరజ్ కావేరి బర్డ్స్ ఆఫ్ పీరంచెరువు పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకంలో 119 పక్షుల జాబితాను స్థానికులు అభిషేక్ శ్రోతి, విజయకావేరి, ధీరజ్‌కావేరిలు డాక్యుమెంట్ చేశారు. బర్డ్స్ ఆఫ్ పీరంచెరువు పుస్తకాన్ని బుధవారం కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీరంచెరువు సరస్సు, స్నేహిత కొండల్లో చుట్టుపక్కల ఉన్న సుసంపన్నమైన జీవవైవిధ్యం గురించి అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో 'స్టే యాక్టివ్' ప్రచారం చేసి పుస్తకాన్ని ప్రచురించడం అభినందనీయమన్నారు.

- సరస్సు పరిసరాలతో పాటు పక్కనే ఉన్న స్నేహితహిల్స్‌లలో రాతి నిర్మాణాలు, కొంగలు, ఎగ్రెట్స్, కింగ్‌ఫిషర్లు, మరెన్నో రకాల పక్షులతో కూడిన జీవవైవిధ్య సంపన్న ప్రాంతగా ఉందన్నారు.
- ఫిబ్రవరి 2023లో ఇటీవల నిర్వహించిన 'గ్రేట్ బ్యాక్‌యార్డ్ బర్డ్ కౌంట్' తర్వాత బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు సరస్సు రాష్ట్రంలోనే టాప్ 10 బర్డ్ హాట్‌స్పాట్‌లలో ఒకటిగా ఉందన్నారు.



పీరంచెరువు వ్యూ..

- ఈ సహజ నీటి వనరులు, కొండలు భావితరాలకు ఉండేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ప్రజలు చెరువును కలుషితం కాకుండా అందరూ తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.